

కథా కౌముది

# ఏడుకొండల సాక్షిగా! - లక్ష్మీ భారతీరెడ్డి

కాలానికి ఉన్న వేగానికి సాక్ష్యంగా, రేపటితో నడియార్ పిళ్ళై కాలం చేసి ఏడాదవుతోంది. అతని ఆత్మశాంతి కోసం అంటే తప్పేమో.. ముఖ్యంగా నా అంతరాత్మ సంతృప్తి కోసం, సంవత్సరం నుండీ వేధిస్తోన్న మనస్సుకి సమాధానంగా పదిమందికీ అన్నదానం చేసి కొంతైనా పాప ప్రక్షాళన చేసుకోవాలనే నిర్ణయించుకున్నాను. ఈ విషయమే నా భార్యతో చెప్పాను.

ఇప్పుడు అన్నదానం చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? కూరలు తరుగుతూ ప్రశ్నించింది తను.

ఏమని చెప్పను... ఏం చెప్పి చేసిన తప్పుకు నీతి దొంగ ముసుగు ఎలా కప్పను.

"ఏం లేదే పదిమందికి అన్నం పెడ్తే పుణ్యం వస్తుందని, అందులో తప్పేముందట? "

"సరే మీ ఇష్టం" తరిగిన కూరలు ఓ గిన్నెలో వేస్తూ ఆమె సమాధానం!

వెంటనే ఉడిపి హోటల్‌కెళ్ళి మరునాటి మధ్యాహ్నం ఓ యాభైమందికి క్యాటరింగ్ ఆర్డరు చేసి, ఓ నలుగురు బాయ్స్‌ని కూడా పంపమని చెప్పాను.

మరుసటి రోజు మధ్యాహ్నం!

మా ఇంటి ముదున్న ఖాళీ స్థలంలో షామియాన వేయించి అంతా సిద్ధం చేసాను.

వచ్చిన వాళ్ళంతా భోంచేస్తున్నారు.

ఎందుకో తెలీని బాధ, గుండె భరించలేనంత భారం నా మది జ్ఞాపకాల గదిలోనుంచీ గతం తాలూకు నీలినీడల సాక్షిగా అస్పష్టంగా ఓ ప్రకటన వినిపిస్తోంది.

యాత్రికులకు విజ్ఞప్తి

యాభై రూపాయల సుదర్శనం కంకణ, ధరించిన శ్రీవారి దర్శనం కోసం పదవ నెంబరు క్యూ కంపార్ట్‌మెంట్లో వేచి ఉన్న భక్తుడు శ్రీ నడియార్ పిళ్ళై గుండెపోటుతో మరణించారు. మృతదేహం అశ్వనీ హాస్పటల్ మార్చురీలో ఉంచడమైంది. అతని సంబంధీకులు ఎవరైనా ఉంటే శ్రీవారి ఆలయం దగ్గరలో ఉన్న ఎంక్వయిరీ సెక్షన్లో సంప్రదించవలసిందిగా కోరుతున్నాం. మృతి చెందిన భక్తుని జేబులో లభించిన ప్యాకెట్ డైరీ ఆధారంగా అతని వివరాలు పేరు నడియార్ పిళ్ళై. పుట్టిన తేది. 12.10.65. ఎత్తు 5.9 అడుగులు. రంగు, ఛామనఛాయ, చిరునామా నడియార్ పిళ్ళై, పిళ్ళై నిలయం, కాసర గౌడ గ్రామం, ఉప్పల గేట్ దగ్గర, కేరళ రాష్ట్రం. వివరాలు మరోసారి ఆ ప్రకటన మళ్ళీ, మళ్ళీ నా చెవిలో మారుమోగుతోంది!

ఎదలో సముద్రఘోష మొదలైంది!

ఆటుపోట్ల ఘోష లేనిదే అది సముద్రం కాదు!

జ్ఞాపకాల ఘోష లేనిదే అది జీవితం కాదు!

చేసిన పొరపాటుకు పశ్చాత్తాప పడకపోతే, ప్రాయశ్చిత్తం చేసుకోకపోతే వాడు మనిషే కాదు. నేను చేసింది తప్పే అది నూటికి నూరు పాళ్ళ నిజం కూడా.

కానీ నేనున్న ఆ పరిస్థితుల్లో

అప్పటి తప్పనిసరి పరిస్థితిలో చేయగలిగింది ఏమీలేదు తప్పో ఒప్పో... నాకసలు క్షమాపణ ఉందో లేదో... అసలు నేను క్షంతవ్యుడిని అవునో కాదో... కాలమే చెప్పాలి. ఆదరంగా కన్నీళ్ళు తుడవాలి.. గుక్కెడు ఓదార్పు నీళ్ళు తాగించాలి.

గతం కన్నీళ్ళ మధ్య అప్పటి దృశ్యం అస్పష్టంగా గుర్తుకొస్తోంది.

✡✡✡

హిందీ భాషా ఉపాధ్యాయుడిగా గవర్నమెంట్ గిరి చేసి కొన్ని నెలల క్రితమే రిటైర్డ్ అయ్యాను. నేను ముగ్గురు ఆడపిల్ల తండ్రిని. సగటు తండ్రి పడే ఇబ్బందులూ, కష్టాలూ పడక తప్పింది కాదు. స్తోమతకు తగ్గ సంబంధాలతో ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్ళు చేసే సరికి"పెళ్ళి చేసి  చూడు" అన్న సామెత నాకు సరిగా సరిపోయింది.

అప్పుల తిప్పలు కౌగలించుకున్నాయి, నా మధ్యతరగతి స్థాయిని ప్రశ్నిస్తూ. పై పెచ్చు రిటైర్డ్ అవడంతో అప్పుల ఆరళ్ళు ఎక్కువయ్యాయి.

ఫి.ఎఫ్. ఇతర్రతా కలిపి ఓ మూడు లక్షలవరకూ వచ్చాయి. దాంతో అప్పుల తాలూకు గొంతు పూర్తిగా నొక్కలేకపోయినా కొంత వరకు అణగదొక్కగలిగాను.

అప్పులు... చేసేటప్పుడు ఆలోచన రానివ్వదు... తీర్చాల్సినప్పుడు ఇబ్బందుల డప్పులతో నానా తంటాలు పడాల్సినంత ఆవేదన మిగులుతుంది, మర్మగర్భంగా!

ఇక మిగిలిందంతా చిన్నమ్మాయి పెళ్ళి!

కలక్టరేట్‌లో ఎల్.డి.సి.గా పనిచేస్తున్న అబ్బాయితో సంబంధం కుదిరింది చేతుల్లో అప్పులు తప్ప చెప్పుకో తగ్గ మొత్తం లేదు.

ఇక మిగిలింది ఇల్లు!

అమ్మేస్తే ఓ నాలుగు లక్షలు వరకూ రావచ్చు.

చిన్నమ్మాయిని సాగనంపి, నేను నా భార్య ఏదైనా అద్దె ఇల్లు తీసుకుని వచ్చే పెన్షన్‌తో కాలం గడపాలని నిర్ణయించుకున్నాం.

ఇల్లు బేరానికి పెట్టాం. కొద్ది రోజుల్లో ఆ పనీ పూర్తికావచ్చు.

అందుకే నా ఆఖరి కుమార్తె పెళ్ళి నిర్విఘ్నంగా జరగాలని ఆ ఆపదమొక్కులవాడిని వేడుకుందామని తిరుమల వెళ్ళాను.

తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది!

ముందుగానే 50.రూ ప్రత్యేక దర్శనం కంకణం ధరించి ఉండటం వల్ల మధ్యాహ్నం రెండు గంటలకు దర్శన సమయం కేటాయించారు. అయినా పన్నెండు గంటలకే కంపార్ట్‌మెంట్లోనికి వదిలారు. గోవిందా... గోవిందా.. గోవిందా అంటూ భక్తులందరూ ముక్తకంఠంతో అంటూ ముందుకు కదిలారు. కంపార్ట్‌మెంట్‌లో అందరూ కూర్చున్నారు. నా ప్రక్కనే ఓ నడివయస్కుడు, అతని ప్రక్కనే పసుపురాసి, కుంకుమ బొట్లు పెట్టున్న ఓ మూట!

బహుశా హుండీలో వేయడానికి మొక్కుబడి మూట కాబోలు!

ఎందుకో అతని ముఖంలో ఆందోళనతో పాటు అలసట కనిపించింది.

ఎక్కడికైనా వెళ్ళినప్పుడు ప్రక్కవాళ్ళతో పరిచయాలు మామూలే!

ఆప్‌కిదర్‌సే ఆయా హై? ప్రశ్నించానతన్ని హిందీలో

కేరళాసే!

అతని సమాధానం

ఆప్‌కా నామ్,

నడియార్ పిళ్ళై

మేరానాం జయరామయ్య!

ఇలా సాగాయి మా సంబాషణలు,

గంట నిరీక్షణం తరువాత కంపార్ట్‌మెంట్ గేట్లు తెరిచారు

ఏడుకొండలవాడా... వెంకటరమణా... గోవిందా.. గోవిందా.. అంటూ వడివడిగా అందరూ ముందుకు కదిలారు.

దాదాపుగా లైను సగం కదిలాక నా చేతిలో ఏదో బరువైన వస్తువు ఉన్నట్లు అనిపించడంతో చేతిని సరిచూసుకున్నాను.

ఇంతకు ముదు నా ప్రక్కన కంపార్ట్‌మెంట్లో కూర్చున్న ఆ నడివయస్కులు నడియార్ పిళ్ళై మొక్కుబడి తాలూకు మూట అది!

ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు? పోనీ తిరిగి వెనక్కి వెళదామంటే క్యూలో విపరీతమైన రద్దీ! అయినా వదిలేసిన కంపార్ట్‌మెంట్లో ఇంకా ఎవరుంటారని? అతను నాతో పాటు ఈ లైన్లోలోనే ఉండవచ్చు... కానీ ఈ జనంలో ఎక్కడున్నాడని వెతకను?

అందుకే దైవదర్శనం తర్వాత అతని తరపున మొక్కుబడే మూటను హుండీలో వెద్దామని నిర్ణయానికొచ్చాను.

దర్శనానంతరం హుండీవైపు అడుగులేస్తుంటే... ఆ మూటలో ఏముందో చూడాలన్న కుతూహలం కలిగింది.

విమాన వెంకటేశ్వరుడి కెదురుగా ఉన్న నాలుగుకాళ్ళ మండపంలో ఓ మూలన కూర్చుని మూట విప్పి అదిరిపడ్డాను.

అన్నీ వెయ్యిరూపాయల సీల్డ్ నోట్ల కట్టలు ఓ పదివరకూ ఉన్నాయి... అంటే పదిలక్షలు!

గుండెదడ పెరిగింది, శరీరంలో సన్నటి ప్రకంపనలు మొదలయ్యాయి, దీనికి తోడు ఇప్పుడున్న ముందున్న సమస్యలు రెండు. ఒకటి నిజాయితీతో ఆ డబ్బులు హిండీలో వేయడమా?

రెండోది ఈ డబ్బుతో చిన్నమ్మాయి పెళ్ళి చేసి అప్పులు తీర్చేయడమా? కూతురి పెళ్ళికి అట్టే టైం లేదు! మరో నెలలో పెళ్ళీ! ఏం చెయ్యాలి? ఎటు మొగ్గాలి? నిజాయితీకా... లేక స్వీయ అవసరాలకా? భగవంతుడా.... ఇది తప్పో, ఒప్పో నిర్ణయించుకోలేకపోతున్నాను నన్ను క్షమించి! మూటను మళ్ళీ కట్టేసి గుడినుంచీ బయటపడ్డాను. గుడి ముందున్న దుకాణంలో ఓ బ్యాగ్ కొని అందులో ఆ మూటను వేసి భుజానికి తగిలించుకుని వెనుతిరుగుతున్నంతలో టి.టి.డి వారి ప్రకటన వినిపిస్తోంది.

యాత్రికులకు విజ్ఞప్తి

ప్రత్యేక దర్శనార్థ 50 రూ. కంకణాలు ధరించిన శ్రీవారి దర్శనం కోసం పదవ నెంబరు క్యూ కంపార్ట్‌మెంటులో వేచి ఉన్న భక్తుడు నడియార్ పైళ్ళైగారు గుండెపోటుతో మరణించారు. అతని మృతదేహం అశ్వనీ హాస్పటల్ మార్చురీలో ఉంది దయచేసి అతని సంబంధీకులు ఎవరైనా ఉంటే స్వామి వారి గుడి ఎదురుగా ఉన్న ఎంక్వయిరీ విభాగానికి రావలసిందిగా కోరుతున్నాం! మరణించిన భక్తుని వివరాలు అతని జేబులో ప్యాకెట్ డైరీ ఆధారంగా లభించాయి.

పేరు - నడియార్ పిళ్ళై

ఎత్తు - 5.9 అడుగులు

రంగు - ఛామన ఛాయ

చిరునామా - నడియార్ పైల్లై

కాసర్‌గౌడ్ గ్రామం

ఉప్పల్ గేట్

కేరళ రాష్ట్రం

టపాల్ల చేతిలో ఉన్న బ్యాగును చూసుకున్నాను. ఆపై అనౌన్స్‌మెంట్ వినిపిస్తున్న వైపుగా చూసాను. చివరిగా గుడివైపూ చూసాను. ఎటు వెళ్ళాలో అర్ధం కాని పరిస్థితి! తప్పో ఒప్పో ఆలోచించకు చేసేది చేసెయ్... కానిచ్చేది కానిచ్చేసెయ్.. డోంట్ స్టాప్ అంటిల్ రీచ్‌టాప్ అని మనసంటోంది.

జీవితమనే రన్నింగ్ రేసులో పరిగెట్టగలిగినంత వేగంగా పరిగెట్టెయ్ మనేది ఆశ!! కానీ ఆశ పేరాశగా మారితేనే ప్రమాదం అంటోంది నా ఆత్మ సాక్షి!

నాలోని లోపలి మనిషి మాత్రం ఏం నువ్వేం దొంగతనం చెయ్యలేదు కదా? ఎవర్నీ మోసం చెయ్యలేదు కదా.. అందుకే రైట్ ... రైట్.. అంటున్నాడు! అందుకే క్షమించు తండ్రీ అనుకుంటూ బస్టాండ్ వైపు కదిలాను. ఆ డబ్బుతో ఆఖరమ్మాయి పెళ్ళి జరిపించాను. అప్పులు తీర్చాను.

✡✡✡

ఉన్నఫళంగా అంత డబ్బు ఎక్కడినుంచీ వచ్చిందండి? అని ఎవరూ అడగలేదు ఒక్క నా భార్య తప్ప! ఎంతైనా సహధర్మచారిణి కదా! కౌగిళ్ళనే కాదు, కన్నీళ్ళనూ సమానంగా పంచుకున్న ఆమెకు ఆమాత్రం హక్కుంది! నిజం చెపితే అసహ్యించుకుంటుందేమో? పోనీ ఒక అబద్ధం చెపితే? మొదటిసారి అబద్ధం చెప్పడం చాలా సులువే.. గ్లాసుడు మంచినీళ్ళు గతగటా తాగినంత, కానీ ఆ అబద్ధాన్ని నిజం చేయడం కోసం వేలకొద్దీ మళ్ళీ అబద్ధాలు ఆడాలి. కుండల కొద్దీ పశ్చాత్తాప కన్నీటిని అంతరాత్మకు తాగించాల్సిందే! అందుకే అవసరం వచ్చినప్పుడు అంతా చెపుతాన్లే. అయితే ఒకటి మాత్రం నిజం. ఈ డబ్బు నేనెవర్నో మోసం చేసో, అన్యాయంగానో, దొంగతనంగానో తెచ్చింది కాదు మొఖం చాటేస్తూ అన్నాను.

"మరెక్కడిది?"

"ఆ అపదమొక్కులవాడే ఆదుకున్నాడనుకో" అటునుంచీ కదులుతూ అన్నాను. అయితే కూతుళ్ళు, అల్లుళ్ళు మాత్రం, చూసారా ఎప్పుడు ఏం కోరినా డబ్బుల్లేవని సణిగేవారు. మరి ఉన్నట్టుండి ఏ మదరి లాటరీ తగిలిందో అంటూ గుసగుసలు పోవడం గుట్టుగా విన్నాను.

ఆ లాటరీ పేరు నడియార్ పిల్లై అని ఎవరికి ఎలా చెప్పుకోను?

కూతుళ్ళు, అల్లుళ్ళు అలకల రథం ఎక్కి తమకు ఏమీ ఇవ్వలేదన్న కోపం గుర్రాల్ని కట్టి..స్వార్ధం కొరడా విసురుతూ వెళ్ళిపొయ్యారు.

బాధ్యతల బరువును దింపుకోగలిగినా, మనసు మాత్రం కుదుటపడలేదు. ఇక ఎప్పటికీ కుదుటపడదేమో?

అంతా భోజనం చేసి వెళ్ళిపోయారండి, మీరేలోకంలో ఉన్నారూ? అంటూ నా భార్య నన్ను కదిలిస్తూ అనటంతో ఉలిక్కిపడి ఆమెవేపు చూసాను. అయినా చెవిలో ఇంకా యాత్రికులకు విజ్ఞప్తి! నడియార్ పిళ్ళై.... ఆ అనౌన్స్‌మెంట్ నా చెవుల్లో మారుమోగుతూనే ఉంది. ఈ కాయాన్ని ఊపిరి ఖాళీ చేసేదాకా అలా సాగుతూనే ఉంటుందేమో?

భాధవేరు...భారంవేరు.... బాధతో చెలిమి చేసిన బతుకు భారం వేరు.

✡✡✡